
# నయా ఈ-లూనా

## సింగిల్ చార్జింగ్‌తో 110 కిలోమీటర్ల మైలేజీ



**విడుదల చేసిన కైనెటిక్ గ్రీన్ ధర రూ.69,990**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అప్పుడెప్పుడో 30-40 ఏండ్ల క్రితం మార్కెట్‌లో హల్‌చల్ చేసిన లూనా.. మళ్లీ కొత్త రూపులో ముందుకొచ్చింది. 'ఈ-లూనా' పేరుతో దీన్ని దేశీయ మార్కెట్‌కు బుధవారం కైనెటిక్ గ్రీన్ పరిచయం చేసింది. ఈ విద్యుత్తు ఆధారిత (ఈవీ) ద్విచక్ర వాహనం.. రైతులు, చిరు వ్యాపారుల వినియోగానికి, వస్తూత్పత్తుల డెలివరీలకు వీలుగా ఉన్నది. వెనుక సీటును వేరుచేసుకునే సదుపాయం ఉన్న ఈ టూవీలర్‌పై సిలిండర్లు, పెట్టెలు, ఇతరత్రా సామాగ్రిని సులువుగా తరలించవచ్చని కంపెనీ వర్గాలు చెప్తున్నాయి. ఇక ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం దీని ధర రూ.69,990. మల్‌బెర్రీ రెడ్, ఓషియన్ బ్లూ, పియర్ల్ ఎల్లో, స్పార్క్‌లింగ్ గ్రీన్, నైట్ స్టార్ బ్లాక్ రంగుల్లో ఈ ఎలక్ట్రిక్ మోపెడ్ కస్టమర్లకు అందుబాటులో ఉంటుంది. ఒకినావా డ్యూయల్ 100, టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100 తదితర మాడళ్లకు పోటీనివ్వగలదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ప్రత్యేకతలు**

- 2కిలోవాట్ సామర్థ్యం కలిగిన బ్యాటరీ.
- మార్పిడి సౌకర్యం.
- యూఎస్‌బీ చార్జింగ్ పోర్ట్.
- 4 గంటల్లో పూర్తిగా చార్జింగ్.
- ఒక్కసారి చార్జింగ్ చేస్తే 110 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు.
- 1.2కిలోవాట్ మిడ్-మౌంటెడ్ మోటర్.
- గరిష్ఠ వేగం గంటకు 50 కిలోమీటర్లు.
- టెలిస్కోపిక్ ఫోర్క్, డ్యూయల్ షాక్ అబ్జర్బర్లు.
- 150 కిలోల వరకు బరువును మోయగలదు.
- సరకు రవాణా కోసం బ్యాగ్ హుక్స్.

## బైజూస్‌కు ఎన్‌సీఎల్‌టీ నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రముఖ ఎడ్-టెక్ కంపెనీ బైజూస్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) బుధవారం మరో నోటీసునిచ్చింది. ఈసారి ఫ్రాన్స్‌కు చెందిన టెలీపెర్ఫార్మెన్స్ బిజినెస్ సర్వీసెస్ సంస్థ దాఖలు చేసిన దివాలా పిటిషన్‌పై ఈ తాఖీదు బైజూస్‌కు వెళ్లింది. రెండు వారాల్లోగా దీనిపై స్పందించాలంటూ ఈ కేసును వచ్చే నెల 11కు ఎన్‌సీఎల్‌టీ వాయిదా వేసింది. బైజూస్‌కు బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బీపీవో) సేవల్ని అందించామని, రూ.4 కోట్లకుపైగా బకాయి పడిందని, ఆ సొమ్ము ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సదరు టెలీపెర్ఫార్మెన్స్ కంపెనీ ఈ దివాలా పిటిషన్ వేసింది. ఇదిలావుంటే డిజిటల్ మార్కెటింగ్ సంస్థ సర్ఫర్ టెక్నాలజీస్.. బైజూస్‌పై దివాలా పిటిషన్‌ను ఎన్‌సీఎల్‌టీలో వేసిన సంగతి విదితమే. రూ.2.3 కోట్లు ఇవ్వాలని కోరుతూ ఎన్ఎసీఎల్‌టీని ఆశ్రయించింది. దీంతో మంగళవారం కూడా బైజూస్‌కు ఎన్‌సీఎల్‌టీ నోటీసునిచ్చింది. మరోవైపు బైజూస్‌కు టర్మ్ లోన్లిచ్చిన కొన్ని విదేశీ సంస్థలు సైతం ఎన్‌సీఎల్‌టీలో దివాలా పిటిషన్లు వేశాయి. ఇవన్నీ విచారణకు రావాల్సి ఉన్నాయి. మరోవైపు బీసీసీఐ కూడా రూ.158 కోట్ల కోసం ప్రత్యేకంగా దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది.

## సెల్ఫ్-లాండ్రీ సేవల్లోకి ఎల్‌జీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:లాండ్రీ సేవలు లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకోసం ప్రత్యేకంగా సెల్ఫ్-లాండ్రీ సేవలను ప్రారంభించింది గృహోపకరణాల సంస్థ ఎల్‌జీ. నూతన వ్యాపారంలో అడుగుపెట్టడంలో భాగంగా ఎల్‌జీ...విశ్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం తాజాగా సెల్ఫ్ లాండ్రీ సేవలను ఆరంభించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## మార్చి 31కల్లా ఆఫీసుకు రండి

**లేకపోతే పరిణామాలు: టీసీఎస్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఆఫీసు నుంచే పనిచేయాలంటూ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులను కోరుతూ అందుకు మార్చి 31 తుది గడువు తేదీగా నిర్ణయించింది. గతంలో ప్రకటించిన గడువు ఇప్పటికే ముగిసిపోవడంతో దీనిని తాజాగా పొడిగించింది. దీనిని మరింత పెంచబోమని, ఇదే తుది గడువు అని స్పష్టం చేసింది. అప్పటికల్లా ఆఫీసుకు వచ్చి పనిచేయని ఉద్యోగులు తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని టీసీఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్‌జీ సుబ్రమణియం హెచ్చరించారు. పని సంస్కృతి, సెక్యూరిటీ కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ అంశంపై తుది కమ్యూనికేషన్‌ను ఉద్యోగులకు పంపించామని తెలిపారు. ఇంటి నుంచి పనిచేయడం ఉద్యోగులు, యాజమాన్యానికి మంచిదికాదని, సైబర్ దాడుల రిస్క్ ఉంటుందని, నియంత్రణ కొరవడుతుందని, సెక్యూరిటీకి ముప్పు ఏర్పడుతుందని వివరించారు. కొవిడ్-19 తర్వాత కంపెనీ అమలు చేస్తున్న హైబ్రీడ్ మోడల్‌కు స్వస్తి పలకాలని టీసీఎస్ భావిస్తున్నది. అయితే ఉద్యోగులందరూ కార్యాలయాలకు తిరిగి వచ్చిన 2025 తర్వాత నాలుగో వంతు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఉంటుందని గతంలో కంపెనీ ప్రకటించింది.

## గడువు పెంచండి: పేటీఎం సీఈవో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పేటీఎం వ్యవస్థాపక సీఈవో విజయ్ శేఖర్ శర్మ భేటీ అయ్యారు. మంగళవారమే ఈ సమావేశం జరిగినట్టు బుధవారం సంబంధిత వర్గాల ద్వారా తెలియవచ్చింది. అయితే కేవలం 10 నిమిషాలపాటే ఇరువురు మాట్లాడుకున్నట్టు చెప్తున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) లేవనెత్తిన పలు సమస్యలు, సంస్థ ప్రస్తుత పరిస్థితి గురించి మంత్రికి ఈ సందర్భంగా శర్మ వివరించినట్టు సమాచారం. ఇదిలావుంటే ఫిబ్రవరి 29 డెడ్‌లైన్‌ను పొడిగించాలని ఆర్బీఐని శర్మ కోరుతున్నట్టూ తెలుస్తున్నది.


# అధిక వడ్డీ ఎఫ్‌డీకి ఆఖరి ఛాన్స్

## ఆర్బీఐ పాలసీ నేపథ్యంలో నిపుణుల మాట

హైదరాబాద్, ఫిబ్రవరి 7: దాదాపు రెండేండ్ల నుంచి పెరుగుతూ వచ్చిన వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశం లేదని, గరిష్ఠ వడ్డీ రేటుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేయడానికి ఇదే చివరి ఛాన్స్ అని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వ్‌బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాల్ని గవర్నర్ శక్తికాంత్ దాస్ ఫిబ్రవరి 8న వెల్లడించనున్న నేపథ్యంలో నిపుణులు వారి అంచనాల్ని వివరించారు. గురువారం నాటి పాలసీ సమీక్షలో ఆర్బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా అట్టిపెడుతుందని, కానీ ఇదే తీరు ఎక్కువ కాలం కొనసాగబోదని అన్నారు. తదుపరి రోజుల్లో ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉన్నందున, ఎఫ్‌డీలపై అధికవడ్డీ ఆశించేవారికి ఇదే తగిన తరుణం అని చెప్పారు. ఆర్బీఐ రెపో రేటు ఆధారంగా బ్యాంకులు వాటి డిపాజిట్, రుణ రేట్లను నిర్ణయించుకుంటాయి. రెపోను పెంచినపుడు ఎఫ్‌డీ రేట్లను పెంచడం, తగ్గించినపుడు కోత పెట్టడం చేస్తుంటాయి. వరుసగా పలు దఫాలు 250 బేసిస్ పాయింట్ల (2.5 శాతం) మేర రెపో రేటును పెంచిన ఆర్బీఐ 2023 ఫిబ్రవరి నుంచి అదేస్థాయి వద్దే కొనసాగిస్తున్నది. ఇప్పుడది 6.5 శాతం ఉంది.

**ఎప్పుడు తగ్గుతాయి?**

ప్రస్తుతానికి ఆర్బీఐ యథాతథ వడ్డీ రేట్ల పాలసీని కొనసాగించినా, విధాన వైఖరిని వెల్లడించే పదం ద్వారా రేట్లు త్వరలో తగ్గుతాయా? లేక తగ్గవా అనే అంశంపై ఒక అంచనాకు రావచ్చని విశ్లేషకులు చెపుతున్నారు. గురువారం నాటి సమీక్షలో రిజర్వ్‌బ్యాంక్ రేట్లు, వైఖరి..రెండింటినీ మార్చబోదని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకానమిస్ట్ మదన్ సబ్నవీస్ చెప్పారు. అధిక ద్రవ్యోల్బణంతో ఆర్బీఐ ఆందోళన చెందుతున్నదని, ఇది తగ్గుముఖం పడుతుందన్న అంచనాలకు వస్తే కేంద్ర బ్యాంక్ తన వైఖరిని మార్చుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ పేర్కొంది. డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠస్థాయి 5.7 శాతాన్ని అందుకోవడంతో పాటు ఆహారోత్పత్తుల ధరలు రెండంకెల్లో పెరిగాయి. ఇటీవలి పాలసీ ప్రకటనలో ఆర్బీఐ 'విత్‌డ్రాయిల్ ఆఫ్ అకామిడేషన్' అనే పదం వాడుతున్నది. అంటే సరళ పాలసీ విధానాన్ని ఉపసంహరిస్తున్నామని చెప్పడం. దీనిని తాజా ఎంపీసీ సమీక్షలో 'న్యూట్రల్' మార్చుచేస్తే, అధిక వడ్డీ రేట్లు ఇక ఉండవన్న సంకేతాలు ఇవ్వడమే. మార్చి మధ్యనాటికల్లా రబీ పంట మార్కెట్లోకి రావడంతో ఆహారోత్పత్తుల ధరలు తగ్గుముఖం పడతాయని, మరోవైపు ఆర్థికాభివృద్ధికి సైతం ఊతం అందించాల్సి ఉన్నందున ఫిబ్రవరి పాలసీ సమీక్షలో ఆర్బీఐ తన వైఖరిని 'న్యూట్రల్'లోకి మార్చుకుంటుందని అంచనా వేస్తున్నట్టు కేర్‌ఎడ్జ్ వివరించింది.



**ఇవే గరిష్ఠ రేట్లు**

రుణ డిమాండ్‌కు తగ్గ డిపాజిట్ల వృద్ధి కొరవడటంతో బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత తక్కువగా ఉన్నదని, దీంతో త్వరలో స్వల్పకాలిక ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లు పెరిగినప్పటికీ, దీర్ఘకాలిక ఎఫ్‌డీలకు ఇప్పటికే గరిష్ఠ రేట్లు అని, మరింత పెరిగే అవకాశం లేదని ఫిజ్‌డమ్ రీసెర్చ్ అంచనా వేసింది. అలాగే ఈ ఏడాది మధ్య నుంచి ప్రపంచ దేశాల్లో కేంద్ర బ్యాంక్‌లు వడ్డీ రేట్లను తగ్గిస్తాయన్న సంకేతాలు ఇప్పటికే వెలువడ్డాయి. జనవరి పాలసీ సందర్భంగా యూఎస్ ఫెడ్ 2024లో మూడు దఫాలు వడ్డీ రేట్ల కోతలు ఉంటాయని సూచించింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని అంచనా వేస్తున్నట్టు కేర్‌ఎడ్జ్ తెలిపింది. అప్పటికి ద్రవ్యోల్బణం సైతం 4 శాతానికి దిగివస్తుందని పేర్కొంది. ఇదే అభిప్రాయాన్ని ల్యాడర్‌అప్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ రాఘవేంద్ర నాథ్ వ్యక్తం చేస్తూ యూఎస్ ఫెడ్ రేట్ల కోత ప్రారంభించినపుడు ఆర్బీఐ సైతం ఊరటచెందుతుందని, రుతుపవనాలు సాధారణంగా ఉంటే వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రేట్లు తగ్గే ఛాన్స్ ఉందన్నారు. రేట్ల తగ్గింపు కనుచూపు మేరలోనే ఉన్నదని ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్ అభిషేక్ కుమార్ అంటూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ద్రవ్యలోటు అంచనాల్ని తగ్గించడం, వచ్చే ఏడాదికి మరింత కుదించడంతో రెపో రేటును దించడం ఎంపీసీకి సులభం అవుతుందని చెప్పారు.

## భారత్‌కు ఏఐలో శిక్షణ

**2025కల్లా 20 లక్షల మందికి నైపుణ్యం • మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా నాదెళ్ల**



ముంబై, ఫిబ్రవరి 7: నానాటికి కృత్రిమ మేధస్సు వినియోగం, అవసరం పెరుగుతున్న నేపథ్యంలో దానిపై దేశీయ యువతకు గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే 2025కల్లా 20 లక్షల మంది భారతీయులకు ఏఐపై నైపుణ్యం పెరిగేలా ట్రైనింగ్ ఇవ్వబోతున్నట్టు మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో, భారత సంతతికి చెందిన సత్యా నాదెళ్ల చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన భారత్‌కు వచ్చారు. బుధవారం ఇక్కడ మాట్లాడుతూ.. ఈ కొత్త తరం టెక్నాలజీ అందరికీ సమానమైన వృద్ధిని అందివ్వగలదని అభిప్రాయపడ్డారు. 2025 నాటికి దేశంలో ఏఐ జీడీపీ 500 బిలియన్ డాలర్లను చేరగలదని అంచనా వేశారు. అలాగే ఓవరాల్ జీడీపీ 5 ట్రిలియన్ డాలర్లుగా ఉంటుందన్న ఆశాభావాన్ని కనబర్చారు.

**ఏఐ రెగ్యులేషన్‌కు ఒక్కటై కదలాలి**

కృత్రిమ మేధస్సు నియంత్రణకు సంబంధించి నియమ, నిబంధనల్ని సిద్ధం చేయడానికి భారత్, అమెరికా సహకారం తప్పనిసరి అని, అందుకు ఇరు దేశాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సత్యా నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఇక అంతకుముందు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌ను నాదెళ్ల కలిశారు. ఎయిర్ ఇండియాలో ఏఐ వినియోగంపై స్పందించారు. ఐటీసీ, అర్వింద్ సంస్థలతోపాటు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కూడా ఏఐ టూల్స్‌ను వాడుతున్నట్టు ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కాగా, ఎస్బీఐ చైర్మన్ దినేశ్ ఖారాతోనూ ఆయన ఈ టూర్‌లో భాగంగా భేటీ కావాల్సి ఉన్నది. తెలుగు వారైన సత్యా నాదెళ్ల పదేండ్ల క్రితం 2014 ఫిబ్రవరి 4న మైక్రోసాఫ్ట్ సీఈవోగా ఎన్నికైన విషయం తెలిసిందే.

## ఏడాది తర్వాతే హైదరాబాద్ మెట్రో రైల్ విక్రయం

- **ఇప్పుడు మా అంచనాలకు తగ్గ విలువ రావడం లేదు**
- **ఎల్ టీ సీఎఫ్‌వో శంకర్ రామన్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: తమ హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఫైనాన్షియల్స్ మెరుగైన తర్వాత విక్రయిస్తామని లార్సన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శంకర్‌రామన్ తెలిపారు. ఒక అంగ్ల దినపత్రికతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుపై ఆసక్తిగల కొనుగోలుదార్లు ఉన్నప్పటికీ, వారు మెట్రో ప్రస్తుత నగదు రాబడి ఆధారంగా విలువను ఆఫర్ చేస్తున్నారని, అది ఎల్ అండ్ టీ అంచనాలకు తగినట్టు లేదని వివరించారు. ఎల్ అండ్ టీ తన నాన్-కోర్ ఆస్తులైన హైదరాబాద్ మెట్రోను, పంజాబ్‌లోని నభా పవర్ ప్లాంట్‌ను 2021లో అమ్మకానికి పెట్టింది. తగిన విలువ లభ్యంకాకపోవడంతో ప్రస్తుతం ప్రాజెక్టు బ్యాలన్స్ షీట్‌ను మెరుగుపర్చడంపై దృష్టినిలిపింది. ప్రయాణీకుల సంఖ్యను పెంచుకోవడం తదితర అంశాల కోసం ప్రణాళికల్ని అమలు చేస్తున్నామని, ఒక ఏడాది తర్వాత విక్రయానికి తగ్గరీతిలో ఫైనాన్షియల్స్ మెరుగుపడతాయని భావిస్తున్నామని సీఎఫ్‌వో తెలిపారు. ఇప్పుడు ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ద్వారా ప్రయాణించే వారి సంఖ్య రోజుకు 5 లక్షలు దాటింది. మరోవైపు ప్రాజెక్టుకు ఉన్న రుణ భారాన్ని తగ్గించేదిశగా కంపెనీకి తెలంగాణ ప్రభుత్వం రూ. 3,000 కోట్ల వడ్డీ రహిత రుణాన్ని ఇచ్చింది. రుణాన్ని తగ్గించుకునేందుకు ప్రాజెక్టులో భాగంగా ఉన్న 18.5 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణంగల స్థలాల్ని నగదు చేయాలని ఎల్ అండ్ టీ భావిస్తున్నది. ఈ ప్రాజెక్టుకు ఉన్న అధిక రుణాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని శంకర్‌రామన్ చెప్పారు. రాబడులకు దీర్ఘకాలం వేచిచూస్తే సావరిన్ వెల్త్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమా కంపెనీలకు ఈ ప్రాజెక్టు గిట్టుబాటు అవుతుందని అన్నారు.